
andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.8 కనిష్ఠం 7.2



ఆదిలాబాద్

జిల్లా వార్తలు

5

శనివారం 4 జనవరి 2025



ముత్యాల ముగ్గుల పోటీలకు సిద్ధం చేసిన మైదానం

నేడే ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు

- జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహణ
- జిల్లాలోని మహిళలందరూ ఆహ్వానితులే..

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలో జరుగనున్నాయి. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉదయం 9 గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభం కానున్నాయి. ఎంపికైన విజేతలకు ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి కింద రూ.3వేలు అందించబడుతాయి. ఈ ముగ్గుల పోటీలకు జిల్లాలోని మహిళలు అందరూ ఆహ్వానితులే.




డీసీసీ పీఠం.. ఎవరిది?



- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష ఎంపికపై కసరత్తు
- కొత్తగా తెరపైకి మాజీ ఎంపీ సోయం బాపురావు పేరు
- ఇటీవల సీఎంతో ప్రత్యేకంగా సమావేశమైన కంది శ్రీనివాస్‌రెడ్డి
- పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్న పలువురు ఆశావహ నేతలు
- స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడడంతో డీసీసీపై సర్వత్రా ఆసక్తి

ఆదిలాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): డీసీసీ పీఠం ఎవరిదన్నదే జిల్లా రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ అధికార పార్టీ కావడంతో అందరిదృష్టి అధ్యక్ష పీఠం పైననే కనిపిస్తోంది. పదేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి రావడంతో పదవుల కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. అయితే జిల్లా డీసీసీ నియామకంపై పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం సీనియర్, జూనియర్ నేతల మధ్య వార్ కొనసాగుతోంది. ఎన్నో ఏళ్లుగా పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న వారికే పదవులు దక్కాలని ఓ వర్గం డిమాండ్ చేస్తుండగా.. పార్టీ బాధ్యతలను భుజనా వేసుకుని ముందుకు నడుపుతున్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలంటూ మరోవర్గం గట్టిగా వాదిస్తోంది. దీంతో పార్టీ అధిష్ఠానం పెద్దలు డీసీసీ ఎంపికపై ఆచితూచిగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది. అందరి అభిప్రాయాలను తీసుకుంటున్నా.. చివరికి అధ్యక్ష పీఠం ఎవరిదోనన్న ఆసక్తి సర్వత్రా కనిపిస్తోంది. జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాలు పూర్తిస్థాయిలో ఉండగా.. ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజక వర్గాలు పాక్షికంగా కొనసాగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పని చేశాడంటూ సాజిద్‌ఖాన్‌పై అధిష్ఠానం వేటు వేయడం తో అప్పటి నుంచి డీసీసీ పదవి ఖాళీగానే కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా.. జిల్లా కాంగ్రెస్ పార్టీ పగ్గాలు ఎవరికి అప్పగించక పోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రావడం ఖాయమని తేలిపోవడంతో ఆలోపే డీసీసీ ఎంపిక ఉంటుందన్న అభిప్రాయాలు జోరుగా వినిపిస్తున్నాయి.



సోయం చేరికతో మారిన సీన్

మాజీ ఎంపీ సోయం బాపురావు ఇటీవలే కమలం పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిపోవడంతో పార్టీలో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో సీనియర్ కావడం, తాజా మాజీ ఎంపీ, అలాగే ఆదివాసీ సామాజిక వర్గంలో మంచి పట్టు ఉన్న నేతగా గుర్తింపు ఉండడంతో అధిష్ఠానం ఆయన పేరును కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది. తాజాగా డీసీసీ రేసులో సోయం బాపురావు ఉన్నాడంటూ పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. జిల్లా పార్టీ పగ్గాలు సీనియర్ నేతకు అప్పగిస్తేనే పార్టీ నేతల మధ్య సమన్వయం కుదురుతుందన్న టాక్ వినిపిస్తోంది. అయితే సోయంకు ఏదో ఒక



కంది శ్రీనివాస్‌రెడ్డి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి సోయంబాపురావు

పదవిని ఇచ్చేందుకు అధిష్ఠానం సిద్ధమైనట్లు తెలుస్తుంది. డీసీసీతో పాటు కొమురంభీం కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో పార్టీ పెద్దలు ఉన్నట్లు తెలుస్తుంది. అసలే జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. సరైన నేతకు పార్టీ పగ్గాలు అప్పగిస్తేనే మరిం తగా బలపడే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. అయితే ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎంపీ సోయం బాపురావుకు పార్టీ బాధ్యతలను అప్పగిస్తే సీనియర్లతో కొంత ఇబ్బందికరంగానే ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

కందితో మంతనాలు

ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డితో ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంతనాలు జరుపడం వెనుక అసలు మతలబు ఏమిటన్న చర్చ జరుగుతోంది. డీసీసీ అధ్యక్ష ఎన్నికలపైననే చర్చించినట్లు తెలిసింది. ముఖ్యంగా జిల్లాలో పార్టీ పరిస్థితి, నామినెటె పదవుల నియామకం పైననే చర్చించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జీలతో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ముందు నుంచి జిల్లా రాజకీయాలపై మంచి పట్టు ఉన్న సత్తు మల్లేష్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మద్దతు కీలకంగా మారనుంది. అన్నిరకాలుగా పార్టీని ముందుకు నడిపించే సత్తా ఉన్న కందికే ఎక్కువగా అవకాశాలు ఉన్న ఆయన వ్యతిరేక వర్గంతోనే

(తరువాయి 6వ పేజీలో...)



విజేతలను సన్మానిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త

సీఎం కప్ విజేతలకు పీవో అభినందన

ఉట్నూర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గత రెండు రోజులుగా జరిగిన సీఎం కప్ అతిరెడ్డి స్కూటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచిన ఉట్నూర్ ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాలల క్రీడాకారులను ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అభినందించారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారధి ఆధ్వర్యంలో క్రీడాకారులను అభినందించారు. ట్రైస్ దిలార్డ్ ఈవెంట్లో క్రీడా పాఠశాల విద్యార్థి హెచ్‌కె నగేష్ సిల్వర్ మెడల్ సాధించారని, 600 మీటర్ల పరుగు పందెంలో పరశురాం కాంస్య పతకం సాధించారని, జావలిన్‌త్రోలో బీమేష్‌కాను పతకం సాధించారని పార్థసారథి వివరించారు. ఇందులో జీసీడీవో ఛాయ, ఫిజికల్ డైరెక్టర్లు జాదవ్‌హేమంత్ నాయక్, కోచ్‌లు సునంద్, శివ, శేఖర్ ఉన్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి : డీఐవో

తలమడుగు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డీఐవో రవీందర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఐవో మాట్లాడుతూ పరీక్షల సమయం సమీపిస్తున్నందున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా అధ్యాపకులు సూచించే సలహాలు, సూచనలు పాటించి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

ఫటా.. ఫట్...

మహిళలకు ఐదు రకాల సేవలు అందిస్తున్నాం

- గోపాల సరస్వతి, సఖీ కేంద్రం నిర్వాహకురాలు



జిల్లాలో సఖీ కేంద్రం.. ద్వారా బాధిత మహిళలకు ఐదు రకాల సేవలను అందిస్తున్నామని సఖీ కేంద్రం నిర్వాహకురాలు గోపాలసరస్వతి అన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆమె మాట్లాడారు. మరిన్ని వివరాలు ఆమె మాటల్లోనే..

ప్రశ్న: గడిచిన యేడాది కాలంలో ఎంత మంది బాధితులకు సేవలనందించారు?

జవాబు: గత యేడాది జనవరి నుంచి నవంబరు చివరి వరకు 270 మంది బాధితులు సఖీ కేంద్రాన్ని ఆశ్రయించడం జరిగింది. ఇందులో కోర్టు పెండింగ్ కేసులు 50, క్లోజ్‌డు 105, పరిష్కారం చూపింది 61, వివిధ దశల్లో 54 దరఖాస్తులు ఉన్నా యి. సత్వర సేవలను అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: సఖీ కేంద్రంలో మొత్తం ఎన్నిరకాల సేవలను అందిస్తున్నారు?

జవాబు: సఖీ కేంద్రంలో ఐదు రకాల సేవలను అందిస్తున్నాం. బాధిత మహిళలకు కౌన్సెలింగ్, న్యాయ సలహా, పోలీసు రక్షణ, వైద్య సలహాలు, తాత్కాలిక వసతిని అందిస్తున్నాం. అలాగే మానసిక, లైంగిక, శారీరక, ఆర్థిక, కుటుంబ సభ్యుల వేదింపుల బారీన పడిన బాధితులకు భరోసానిస్తూ అండగా నిలుస్తున్నాం.

ప్రశ్న: ముఖ్యంగా ఎలాంటి ఇబ్బందులతో బాధితులు సఖీ కేంద్రానికి వస్తున్నారు?

జవాబు: గృహహింస వేధింపుల కారణంగా మహిళలు ఎక్కువగా సహాయం కోసం వస్తున్నారు. ఇందులో మద్యం మత్తు, అనుమానంతోనే మహిళలపై వేధింపులు ఎక్కువగా జరుగుతున్నాయి.

ప్రశ్న: బాధితులు సఖీ కేంద్రాన్ని ఎలా సంప్రదించాలి?

జవాబు: బాధితులు సహాయం కోసం 181 హెల్ప్ లైన్‌తో పాటు 08732-223272 నెంబర్లలో సహాయం సేవల కోసం సంప్రదించవచ్చు. అలాగే నేరుగా సఖీ కేంద్రానికి రావచ్చు.

ప్రశ్న: అవసరమైన సిబ్బంది, వసతులు అందుబాటులో ఉన్నాయా?

జవాబు: అవసరమైన సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నారు. ప్రస్తుతం 13 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో సైకోసోషల్ కౌన్సిలర్‌తో పాటు న్యాయవాది, స్టాఫ్‌నర్సు, మల్టిపర్‌పస్ వర్కర్స్, సెక్యూరిటీ గార్డ్సు, కేసు వర్కర్స్, డ్రైవర్స్ అందుబాటులో ఉన్నారు.

- (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్)

ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందిస్తాం

- ఏకసభ్య కమిషన్, హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ షమీమ్ అక్తర్
- ఏకసభ్య కమిషన్‌కు భారీగా వినతులు
- ఉమ్మడి జిల్లా నుంచి భారీగా హాజరైన ఎస్సీ కులస్తులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ బహిరంగ విచారణ కోసం శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చింది. ఈ సందర్భంగా ఏకసభ్య కమిషన్ చైర్మన్, హైకోర్టు రిటైర్డ్ జస్టీస్ డాక్టర్ షమీమ్ అక్తర్, అదనపు డైరెక్టర్ శ్రీధర్‌లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవిలతో కలిసి కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ ప్రారంభించి వినతులను స్వీకరించారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన షెడ్యూల్డ్ కులాల ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, కుల సంఘాల నాయకులు, వివిధ వర్గాల వారి నుంచి వినతులు స్వీకరించి, వర్గీకరణపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. మాదిగలు, మాలలు, జంగములు, చిందులు, బేడ, బుడగ జంగములు, బైండ్ల, మంగులతో పాటు వివిధ వర్గాల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేస్తూ వినతిపత్రాలను అందజేశారు. వివిధ కులస్తులు కలెక్టరేట్‌కు తరలివచ్చి కమిషన్‌కు తమ స్థితిగతులను తెలిపారు. కాగా, ఎస్సీ వర్గీకరణపై అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని హైకోర్టు రిటైర్డ్ న్యాయ మూర్తి జస్టిస్ షమీమ్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ పేర్కొంది. ఈ సందర్భంగా షమీమ్ అక్తర్ మాట్లాడుతూ వర్గీకరణ అంశంతోపాటు సామాజిక స్థితిగతులకు సంబంధించి షెడ్యూల్డ్ కులాలకు చెందిన అన్ని వర్గాల వారు ఎలాంటి ఒత్తిడి లేకుండా నిర్భయంగా కమిషన్‌కు తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చని సూచించారు.

పోటాపోటీ నినాదాలతో ఉద్రిక్తత

ఉమ్మడి జిల్లా నుంచి భారీగా హాజరైన ఎస్సీ కులస్తులతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఎస్సీ వర్గీకరణ విషయంపై నియమించిన ఏకసభ్య కమిషన్, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి డాక్టర్ షమీమ్ అక్తర్‌కు తమ అభిప్రాయాన్ని తెలియజేసేందుకు వచ్చిన వివిధ కులాలకు చెందిన వారు పెద్దఎత్తున తరలివచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు వారిని అదుపు చేశారు. వినతులు ఇవ్వడానికి తరలిరావడంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో వివిధ సంఘాల నాయకులు పోటాపోటీగా నినాదాలు చేయగా.. పోలీసులు వారిని సముదాయించి బయటికి పంపించారు. అయితే, ఎస్సీ వర్గీకరణ చేపట్టొద్దంటూ మాల సంక్షేమ సంఘం నాయకులు ఏకసభ్య కమిషన్‌ను కోరారు. ఆ తర్వాత, ఎస్సీ వర్గీకరణ అంశంపై అభిప్రాయ సేకరణకు ఆదిలాబాద్‌కు వచ్చిన ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే, ఆయా రాష్ట్రాల్లో ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించుకోవచ్చని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణలో కూడా 15 శాతం రిజర్వేషన్లను వర్గీకరించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గణేష్ మహరాజ్ కమిషన్‌ను కోరారు.



మాట్లాడుతున్న హైకోర్ట్ రిటైర్డ్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్

సావిత్రీబాయి పూలే బాటలో నడవాలి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రతీ మహిళ సావిత్రీ బాయి పూలే బాటలో నడవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో ఉన్న టీటీడబ్ల్యుఆర్ఎస్ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుల తల్లి సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలలో శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలి మహిళ గురువు అయిన సావిత్రీబాయి పూలే మహిళలకు ఆదర్శంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీవో అగస్టియస్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, ప్రధానోపాధ్యాయురాలు శీతల్‌చౌహాన్ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం నిర్వహించారు. అలాగే, విద్యార్థులందరు సావిత్రిబాయిపూలేను ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.ప్రతాప్‌సింగ్ సూచించారు. సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ టి.ప్రతాప్‌సింగ్, లెక్చరర్లు, విద్యార్థులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజశేఖర్, డాక్టర్ రవీందర్, ఐక్యుఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ నర్సింగ్‌రావు, లైబ్రేరియన్ చంద్రశేఖర్, అధ్యాపకులు ముజీబ్, రాజశేఖర్, కరుణాకర్, శ్రీకాంత్, రాజ్‌కుమార్, డాక్టర్ కిషన్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నవీన్, స్వప్న, స్వేత, జోహర, ఫాతిమా, యోగలక్ష్మి, స్వామి, ప్రజ్ఞా, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జయంతి వేడుకలకు సుగుణ ముఖ్య అతిథిగా హాజరై ఘన నివాళులర్పించారు.

అలాగే, మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మండలంలోని వివిధ శాఖలలో పని చేస్తున్న మహిళ అధికారులను పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

నేరడిగొండ: సంఘ సంస్కర్త రచయిత స్ఫూర్తి ప్రదాత, మహిళ విద్యకు తన జీవితాన్ని అంకితం చేసిన సావిత్రిబాయి పూలే జయంతిని మండలంలో ఘనంగా జరుపుకున్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళ అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ..

ఆదిలాబాద్ రూరల్: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఆదిలాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్బాయి హరి బాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే సేవలు నేటి మహిళలకు ఆదర్శప్రాయమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు మాజీ జడ్పీ చైర్మన్ సుహాసిని రెడ్డి, నాయకులు మాజీ జడ్పీటీసీ ముస్తాపురే అశోక్, ఆదినాథ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రిన్సిపాల్ సంగీత ఆధ్వర్యంలో జయంతి వేడుకలను జరుపుకొని ఆమె సమాజ నిర్మాణానికి సంఘంలో మార్పులు చేపట్టిన కృషి విద్యార్థులకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజుల పోతన్న, బత్తుల రమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

తాంసి: సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి విగ్రహాలకు ముందుగా క్షీరాభిషేకం చేశారు. గిరిగావ్ గ్రామంలో మాలి సంఘం కులస్తులు మేల వాయిద్యాలతో సావిత్రిబాయి చిత్ర పటంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు, స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ధనుంజయ్, ఉత్తమ్, అశోక్, గంగారాం, పోచన్న, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

● ఆడ పిల్లలు చదువులో రాణించాలి

తలమడుగు: భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయులు సావిత్రిబాయిపూలే స్ఫూర్తితో ఆడపిల్లలు చదువులో రాణించాలని జిల్లా విద్యాధికారి ప్రణీత కోరారు. శుక్రవారం మండలంలోని కజ్జర్ల పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కజ్జర్లలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో ప్రణీత హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే, మండలంలోని సుంకిడి. కజ్జర్ల, తలమడుగు, బరంపూర్, పరిషత్ ఉన్నత పాఠశాల సుంకిడి పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సావిత్రిబాయి పూలే వేషధారణలో బాలలు సందడి చేశారు.

గుడిహత్నూర్: భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే మహిళా లోకానికి ఆదర్శమని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆడే శీల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇంద్రవెల్లి: మహిళల అభ్యున్నతికి దారి చూపిన మార్గదర్శి సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే అని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మిలింద్ నగర్ కాలనీలోని త్రిరత్న బుద్ధ విహార్‌లో మహామాయ ఉపాసిక సంఘ్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిర్మల్ రూరల్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలామల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడు మాట్లాడుతూ.. భారత దేశం మహిళా, ప్రజల ఆశా కిరణం, భారతదేశమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని, జయంతి రోజును మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించడంచాలా సంతోషంగా ఉందని తెలిపారు.

దిలావర్‌పూర్: సావిత్రిబాయి పూలే బాలికల చదువు కోసం తన జీవితాన్నే అంకితం చేసిన చైతన్య మూర్తి అని మండల విద్యాధికారి శంకర్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మహిళా ఉపాధ్యాయ దినోత్సవానికి ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదానంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో నివాళులర్పిస్తున్న ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్

అలాగే, మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. సుదర్శన్ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. ఇందులో చామన్‌పెల్లి తాజా మాజీ సర్పంచ్ పడిగెల గంగాధర్, బొమ్మెన రవి, సుమలత, రవితేజ, అభినయ్, తదితరులు పాల్గొన్నారు.

భైంసా: బాలిక విద్య కోసం విశేష కృషి చేసి సావిత్రీబాయి పులే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవం పేరిట శుక్రవారం భైంసా డివిజన్ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ , ప్రైవేట్ విద్యా సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సావిత్రీబాయి పులే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలు విద్యా సంస్థల్లో విద్యార్థినీలు సావిత్రీబాయి వేషధారణతో వేడుకల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగానే ఆయా విద్యా సంస్థల్లోని మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయా విద్యా సంస్థల్లో ఏర్పాటు చేసిన ససమావేశాల్లో సంబంధిత విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ లింగ వివక్షత, కుల అసమానతలపై సావిత్రీబాయి పులే చేసిన పోరాటం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. మహిళల విద్యకు ప్రాధాన్యతను కల్పించి అణచివేతకు గురైన వర్గాలకు న్యాయం కల్పించేందుకు తన జీవితాన్ని అర్పించిన మహనీయురాలు సావిత్రీబాయి పులే అని పేర్కొన్నారు.

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌లోని శ్రీ అక్షర పాఠశాల, రబింద్ర ఉన్నత పాఠశాల, సరస్వతి శిశు మందిర్, ముథోల్‌లోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ముథోల్‌లోని బస్టాండ్ సమీపాన నాయకులు, దళిత సంఘాల నాయకులు సావిత్రి బాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి జయంతిని నిర్వహించారు.

లోకేశ్వరం: మండల కేంద్రంతో పాటు ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా లోకేశ్వరం బీసీ హాస్టళ్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లోకేశ్వరం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మోడం శంకర్ మాట్లాడారు. కాగా, వివిధ పాఠశాలల మహిళా ఉపాధ్యాయురాళ్లను సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా వారిని సన్మానించారు.

తానూర్ : మండలంలోని బోరిగాం ఉన్నతపాఠశాలలో శుక్రవారం దేశ మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రబాయి పూలే జయంతి సందర్భంగా మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయురాళ్లను సన్మానించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ అనగారిన, బడుగు, బలహీన వర్గాల వారికి విద్య అందించడానికి సావిత్రబాయి పూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకర్ ఉపాధ్యాయులు వి. నారాయణరెడ్డి, బి. విఠల్, భోజరాం, బి. కృష్ణవేణి తదితరులున్నారు.

డీసీసీ అధ్యక్ష పీఠం ఎవరిది?

(5వ పేజీ తరువాయి...)

కొంత ఇబ్బందికరంగా మారిందన్న టాక్ వినిపిస్తోంది. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నిక ల్లో క్లీన్‌స్వీప్ చేసేందుకు కాంగ్రెస్ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ట్లు సమాచారం.

రేసులో పలువురు నేతలు

డీసీసీ రేసులో పలువురు నేతలు ఉన్నట్లు పార్టీలో చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా మావల మండలానికి చెందిన బోరంచు శ్రీకాంత్‌రెడ్డితో పాటు తలమడుగు మండలానికి చెందిన తాజా మాజీ జడ్పీటీసీ సభ్యుడు గోక గణేష్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి మరికొంత మంది సీనియర్, జూనియర్ నేతలు తెరవెనుక ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. పార్టీలో తమకున్న పరిచయాలతో నామినెట్ పదవులను దక్కించుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. పైపైకి అంతా బాగానే కనిపిస్తున్నా.. లోలోన మాత్రం ఒకరిపై ఒకరు అధిష్ఠానం పెద్దలకు వరుసగా ఫిర్యాదులు చేసుకుంటున్నట్లు తెలిసింది. నియోజకవర్గ ఇన్‌చార్జిలకు పార్టీ పదవులు ఇవ్వద్దంటూ ఓవర్గం నేతలు గట్టిగా వాదిస్తున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పేరు కూడా ప్రధానంగా వినిపిస్తున్నా.. ఆ నియోజకవర్గం నిర్మల్ జిల్లాలో కొనసాగడంతో ఆయనకు అవకాశాలు తక్కువేనన్న చర్చ జరుగుతోంది. అయితే కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు, ఏం జరుగుతుందో? చెప్పలేని పరిస్థితులు ఉంటాయని సొంత పార్టీ నేతలే బహిరంగంగా అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే డీసీసీ ఎంపిక పూర్తయితే జిల్లాలో పార్టీ మరింత బలపడే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆదిలాబాద్‌లో మళ్లీ పెరిగిన చలి

● బేలలో 7.1 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత కనిపిస్తుంది. గత రెండు మూడు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోవడంతో చలి తీవ్రత మళ్లీ పెరిగింది శుక్రవారం కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో పగలు రాత్రి చలి ప్రభావం కనిపిస్తుంది. జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 29. డిగ్రీలు కాగా కనిష్ఠంగా 7.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే బేలలో 7.1 డిగ్రీలు, భీంపూర్‌లో 7.2,తలమడుగులో 8.5, ఆదిలాబాద్‌రూరల్ మండలం పిప్పల్‌ధరిలో అత్యల్పంగా 8.8 కనిష్ఠ ఉష్ణోగ్రతలు, బేలలో 9.9, నేరడిగొండలో 9.4 ఇలా జిల్లా వ్యాప్తంగా 20 డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు కప్పేయడంతో ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. తీవ్రమైన చలితో పంటల పై ప్రభావం పడుతుందని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ మారుమూల గ్రామాలలో చలి ప్రభావానికి జనం వణికి పోతున్నారు.

సోనాల సొసైటీకి గ్రీన్ సిగ్నల్

బోథ్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలం నుంచి విడిపోయి నూతనంగా ఏర్పాటైన సోనాల సహకార సంఘం ఏర్పాటు బోథ్ సహకార సంఘం ఏకగ్రీవంగా తీర్మానించి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగింది. సోనాలలో నూతన ప్రాథమిక సహకార సంఘం ఏర్పాటుతో పాటు సహకార బ్యాంక్ నిర్మాణానికి సైతం పాలకవర్గం తీర్మానించింది. సహకార సంఘం డైరెక్టర్ జి.రాజు యాదవ్ రైతుల శ్రేయస్సు కోసం సోనాలలో నూతనంగా బ్యాంకును నిర్మించాలని ప్రతిపాదించారు. స్థలం ఉన్నందున బ్యాంకు నిర్మాణం చేపట్టినట్లయితే భవిష్యత్తులో రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. దీంతో సహకార సంఘం సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సోనాల మండలంలో 10 గ్రామాలు సహకార సంఘం పరిధిలోకి వస్తున్నాయి. 1500మంది సభ్యులు సంఘంలో ఉన్నారు. దీంతో రానున్న సహకార సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు కానుంది. బ్యాంకు నిర్మించినట్లయితే మరికొంతమంది రుణం పొంది సభ్యులుగా ఉండే అవకాశం ఉందని తప్పనిసరిగా బ్యాంకు నిర్మాణం అవసరం ఉంటుందని సోనాల డైరెక్టర్ లోలపు పోశెట్టి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారులకు విన్నవించారు. భవిష్యత్తులో నూతనంగా సహకార సంఘం ఏర్పాటవుతుందన్న రైతులకు రుణాలు అందించి ఆస్కారం ఉందని ఆయన పేర్కొన్నారు.

కల్తీ నూనెలపై కదిలిన యంత్రాంగం

● సీఎంవో కార్యాలయం నుంచి ఆదేశాలు

● రంగంలోకి దిగిన ఎస్‌బీ ఇంటలిజెన్స్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బోథ్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలలో కల్తీ నూనెల విక్రయాలపై బుధవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికార యంత్రాంగంలో కదిలిక వచ్చింది. కామారెడ్డి ప్రాంతం నుండి ఆదిలాబాద్, ఇచ్చోడ కేంద్రాల్లో నుండి నేరుగా నియోజకవర్గ పరిధిలోని బోథ్, నేరడిగొండ, బజార్హత్నూర్, గుడిహత్నూర్ మండలాలకు సరఫరా అవుతుంది. అయితే కల్తీ నూనెల విషయంలో వచ్చిన వార్తకు సీఎంవో కార్యాలయం నుంచి జిల్లా అధికారులకు విచారణ చేపట్టాలని ఆదేశాలు రావడంతో అధికారులు ఇంటలిజెన్స్ ఎస్‌బి పోలీసులు రంగంలోకి దిగారు. కల్తీ నూనెల విక్రయాలపై విచారణ చేపట్టారు. కామారెడ్డి నుండి ఎవరికి నేరుగా వస్తున్నాయని విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దీంతో కల్తీ నూనెల విక్రయాల గుట్టు బయటపడే అవకాశాలు ఉన్నాయి.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నేరడిగొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆవిష్కరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో సంఘం సభ్యులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధన చేసి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గుగ్లోత్‌అంబారావ్, శివరాణి, మహేందర్, చందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ మృతి

బోథ్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్ట పక్క తండాకు చెందిన చౌహాన్ సేవంతాబాయ్(51) శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగి మృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాలు బోథ్ ఎస్సై ప్రవీణ్ తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి.. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారని వీరికి పెళ్లిళ్లు సైతం చేయడం జరిగిందన్నారు. అయితే మృతురాలికి ఆమె చిన్నకోడలు మధ్య ఆస్తి విషయంలో చిన్నపాటి గొడవ జరిగిందని దీంతో ఆమె మనస్థాపన గురై ఉదయం బహిర్భూమికని వెళ్లి వ్యవసాయ భూమిలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరిందన్నారు. విషయాన్ని గమనించిన ఆమె పెద్ద కుమారుడు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఆమెను బోథ్ ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. అయితే పరీక్షించిన డాక్టర్లు చనిపోయినట్లు నిర్ధారించాలన్నారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సోన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాఫ్రాపూర్ గ్రామానికి చెందిన ఆర్మూర్ గంగన్న అనే వ్యక్తికి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. సోన్ ఎస్సై కే. గోపి తెలిపిన వివరాల ప్రకారం... గంగన్న పని నిమిత్తం తన టీవీఎస్ వాహనంపై వెళ్తుండగా జాఫ్రాపూర్ పెట్రోల్ బంక్ వద్ద నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు అతనిని వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టడంతో తలకు, ఎడమ కాలుకు గాయాలయ్యాయి. హుటాహుటిన నిర్మల్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

తలమడుగు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు రెండు లక్షల రుణమాఫీ, ఎకరానికి 15 వేల రైతుబంధు ఇస్తానని చెప్పి సంవత్సరము గడిచిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చడం లేదన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏరాటు చేశారు. ఈ సందర్భంగా మండల రైతులు మాట్లాడుతూ రైతులకు రెండు లక్షల వరకు పూర్తిస్థాయి రుణమాఫీ అవ్వకముందే ప్రభుత్వం వంద శాతం రుణమాఫీ పూర్తి అయిందని, చెప్పడం సిగ్గుచేటు అన్నారు. గ్రామాల్లో రైతులు దిగుబడులు రాక అప్పుల పాలు అవ్వడం జరిగిందని, ప్రభుత్వం వెంటనే అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కాడే శ్రీనివాస్, పద్మాకర్ రెడ్డి, కటకం దేవన్న, శేవ్వ గంగారెడ్డి, ఎడిమెల స్వామి రెడ్డి, నర్సింలు, నడిపి ఉషన్న, స్వామి, ప్రేమేందర్ రెడ్డి, కిస్టు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి సుమలత

క్షయపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి సుమలత

జైనథ్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా గ్రామాలలో గల ప్రతీఒక్కరు క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ సుమలత అన్నారు. శుక్రవారం జైనథ్ మండలంలోని కస్తూర్బాగాంధీ, ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. టీబీ నివారణకు వంద రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇందులో టీబీ లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి తెమడ, చెస్ఎక్స్‌రే మొదలగు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కాప్రీ గ్రామ వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జైనథ్ పీహెచ్‌సీ డాక్టర్ నైనత, మోడల్ స్కూల్ కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రిన్సిపల్‌లు ఎల్.రాము, వీణాకుమారిలతో పాటు ప్రభుత్వ ఆరోగ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● టీబీ రహిత సమాజం నిర్మిద్దాం

ఇంద్రవెల్లి: క్షయవ్యాధి రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు అందరూ తమ బాధ్యత తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ పూజిత అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వంద రోజుల కార్యక్రమంలో భాగం గా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు టీబీ వ్యాధి లక్షణాలు వ్యాప్తి, నివారణ, మొదలైన అంశాలను క్లుప్తంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిపట్ల విద్యార్థులందరు పూర్తిగా అవగాహన తెచ్చుకోవాలన్నారు. ఇందులో హెల్త్ సూపర్‌వైజర్ పవార్ సురేష్, టీబీ సూపర్ వైజర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై పర్యవేక్షణ

తలమడుగు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదల కోసం నూతనంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ఇటీవల సర్వే నిర్వహించగా.. ఆ సర్వేను పూర్తిస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించింది. ఇందులో భాగంగా శుక్రవారం హౌసింగ్ ఏఈ నసీర్ మండలంలోని కోసాయి, దేగామా. కప్పర్ దేవి, మందగూడ తదితర గ్రామాల్లో పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నర్సరీని సందర్శించిన విద్యార్థులు

ఉట్నూర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటీడీఏ ఉద్యాన నర్సరీని జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. వివిధ పంటల సాగు విధానాల పై విద్యార్థులకు ఐటీడీఏ అధికారులు అవగాహన కల్పించారు. శుక్రవారం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ పరిధిలోని ఉద్యాన నర్సరీ,శిక్షణ కేంద్రం (హెచ్ఎన్‌టీసీ)ని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయ (పీజేటీఎస్ఏయూ) పరిధిలోని జగిత్యాల వ్యవసాయ కళాశాలలో మొదటి సంవత్సరం బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న విద్యార్థులు (60 మంది) క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సందర్శించారు. ఉద్యాన నర్సరీలో సాగులో ఉన్న వివిధ రకాల పంటలు వాటి సాగు విధానాలను ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. కాగా, విద్యార్థినీ, విద్యార్థులు మా ట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రైతులకు సలహాలు సూచనలు అందించడా నికి ఈ ఉద్యాన నర్సరీలో వివిధ రకాల పంటల సాగు చేపట్టి అవగాహన కార్యక్రమాల ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో జగిత్యాల వ్యవసాయ కళాశాల అధ్యాపక సిబ్బంది డాక్టర్ జి.సత్యనారాయణరెడ్డి, డాక్టర్ కే.పవన్‌కుమార్, ఉద్యాన నర్సరీ సాంకేతిక అధికారిని కుమారి అర్పిత, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

బోథ్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఓట్లు వేసి గెలిపించినందుకు వారికి ఐదు సంవత్సరాల పాటు రుణపడి ఉంటామని, వారి గ్రామాల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేద్దామని బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దేవుల నాయక్ తండ గ్రామంలో బాల బ్రహ్మచారి ప్రేమ్ సింగ్ మహారాజ్ పుణ్య అతిథి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. మనపై నమ్మకంతో ప్రజలు ఓట్లు వేశారని, వారి కష్టసుఖాలలో పాలుపంచుకొని గ్రామాల అభివృద్ధికి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. గత 25 సంవత్సరాలుగా గ్రామంలో పుణ్యతిథి కార్యక్రమాలను నిర్వహించడం అందుకు కృషిచేసిన గ్రామస్తులు పూజారి లక్ష్మణ్, కార్యక్రమ నిర్మాణ కర్త మంగులాల్ లను అభినందించారు. గ్రామానికి చెందిన యువకులు గతంలో జాతర మూడు సంవత్సరాలు జరిగేదని, కొన్ని కారణాల వల్ల ఒకరోజుతో ముగిస్తున్నామన్నారు. అయితే వేదికపై ఉన్న పెద్దలు సహకరిస్తే రానున్న రోజుల్లో మూడు సంవత్సరాల పాటు జాతరను నిర్వహిస్తామన్నారు. అందుకు అవసరమైన సహకారం అందించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ మాట్లాడుతూ గ్రామస్తులు నిర్వహిస్తున్న కార్యక్రమం ఆదర్శ వంతంగా ఉందన్నారు. భక్తిశ్రద్ధలతోపాటు మానసిక ప్రశాంతత కోసం ఆలయం సుందరంగా తీర్చిదిద్దడం తమ వంతు బాధ్యత అని పేర్కొన్నారు. ఇందులో బీజేపీ జిల్లా నాయకులు, రైల్వే బోర్డు మాజీ సభ్యులు జీవీ రమణ, ఐటీడీఏ మాజీ డైరెక్టర్ భూమన్న మాజీ ఎంపీపీలు ప్రీతం రెడ్డి, సజన్లాల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాన్సింగ్, మాజీ సర్పంచ్ రామ్ కిషన్ జాదవ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు పోతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

3వ రోజుకు హమాలీల సమ్మె

ఉట్నూర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పౌర సరఫరాల గోదాం వద్ద సివిల్ సప్లయి హామాలీ కార్మికులు చేపట్టిన సమ్మె 3వ రోజుకు చేరుకుంది. శుక్రవారం సమ్మెలో భాగంగా అమలులో నినాదాలు చేస్తూ నిలబడి ప్రభుత్వ తీర్పు నిరసన తెలిపారు. ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి మచ్చరమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయి హామాలీ యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. గతంలో సివిల్ సప్లయి కమిషనర్ కార్మికులతో ఒప్పుకున్న ప్రకారం జీఓ విడుదల చేయక పోవడం శోచనీయం అన్నారు. పెరిగిన రేట్ల జీవో అమలు చేయక పోవడం వెనుక ఉన్న మతాలబు కార్మికులకు అర్థంకావడం లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు విద్యార్థులకు అంగన్‌వాడీ సెంటర్లకు ఎండీఎం పిల్లలకు జరుగుతున్న ఇబ్బందులుకు కారణం కమిషనర్ గారే అన్నారు. ఒప్పుకున్న రేట్ల ఒప్పంద జీవో 4 నెలలు అయిన అమలు చేయక పోవడం ఏంటని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలతో సహాఒప్పందం జీవోను అమలు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించి, కార్మికులకు 10లక్షల ఆరోగ్య భీమా కల్పించక పోతే సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

● ఏఐయూకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామయ్య

పెంబి/(ఖానాపూర్), జనవరి 3(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐయూకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య అన్నారు. శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని ఐబీ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని, రైతులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ సమగ్రంగా అమలు చేయాలన్నారు. అంతేకాకుండా స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, ఎన్ఆర్ఈజీఎస్‌లో 200ల రోజుల పని, రోజుకు 600 వేతనం ఇవ్వాలని, అటవీ హక్కు చట్టం 2006 సమగ్రంగా అమలు చేయాలన్నారు. పోడు భూములకు పట్టాలు అందజేయాలన్నారు. భూమి లేని వారికి నాలుగు ఎకరాల భూమి అందజేయాలన్నారు. ఇళ్లు లేని వారికి ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఈ సమస్యలపై నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 9న కలెక్టరేట్ ముందర జరిగే ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో వచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐయూకేఎస్ జిల్లా మండల నాయకులు అంకుష్ రావు, జక్కుల రాజన్న, ఎల్లయ్య, శంకర్, రాజన్న, వర్మ, భాస్కర్, భీమ్ రావు, జంగు, తదితరులున్నారు.

ఆధ్యాత్మిక సేవలో పాల్గొనాలి : బోరంచు

మావల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక సేవలో ప్రతి ఒక్కరూ పాల్గొని, సమాజ సేవకు ప్రాధాన్యం ఇవ్వాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి కోరారు. గత కొన్ని రోజులుగా ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ కళాశాల మైదానంలో జరుగుతున్న విశ్వశాంతి మహా యాగాన్ని సందర్శించారు. యాగం నిర్వహిస్తున్న స్వామిజీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం యాగ నిర్వహణ కోసం తనవంతుగా శ్రీకాంత్ రెడ్డి రూ.రెండు లక్షల ఎనిమిది వేల విరాళాన్ని అందించారు. మిగతా రోజుల్లో జరిగే కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని ఆయన నిర్వాహకులకు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని, దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. భక్తి బావంతో సమాజంలో శాంతితో పాటు జ్ఞాన సముపార్జన సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి గ్రామంలో పాఠశాల, వైద్య ఆరోగ్య కేంద్రం ఎంత అవసరమో, ఆలయాల నిర్మాణం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం కూడా అంతే అవసరమన్నారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు నవీన్ రెడ్డి, రంజిత్ రెడ్డి, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం'

భైంసా, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే పాటుపడుతోందని ఆ యూనియన్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కొండూరి రవీందర్ అన్నారు. శుక్రవారం భైంసాలో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జర్నలిస్టు యూనియన్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వర్గీకరణ చేయొద్దని వినతి

ఇంద్రవెల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎస్సీలకు రిజర్వు చేసిన కేటగిరిలో వర్గీకరణ చేపట్టవద్దని కోరుతూ శుక్రవారం మండల మాల సంఘాల నాయకులు జిల్లా కేంద్రంలో జస్టిస్ షమీమ్ ఆక్తర్‌కు వినతి పత్రం అందజేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 ఎస్సీలకు రిజర్వుడ్ కేటగిరిలో ఉప వర్గీకరణ చేయడం రాజ్యాంగానికి, రిజర్వేషన్‌ల స్ఫూర్తికి, అంబేద్కర్ ఆలోచన విధానానికి వ్యతిరేకమని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్, మాస్కే రాజవర్ధన్, కాంబ్లే లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



సాయి ప్రవచనాలను బోధిస్తున్న వికాస్ మహరాజ్

ప్రారంభమైన మహా సాయి పారాయణం

నిర్మల్ రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాస్త్రినగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో 11వ మహా సాయి పారాయణం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వికాస్ మహరాజ్ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ శ్రీ సాయి సచ్చరిత్ర రచయిత హేమంత్ పంత్ మొదటి అధ్యాయంలో రచన నిర్విఘ్నంగా నెరవేరి నిరాటకంగా పూర్తి చేసేందుకు దేవతల స్తుతి, రుషులను, భక్తులను నమస్కరించి చివరగా పాఠకులకు నమస్కరిస్తూ ఏకాగ్రతతో పారాయణం చేయండని మంగళాచారం ఆచరించారు. శ్రీ గోవింద రఘునాథ్ దభోల్కర్ మొదటి సారిగా 1910 సంవత్సరంలో సాయిబాబాను దర్శించడం సాయిబాబా గ్రంథ రచయితకు హేమంత్ పంత్ అని నామకరణం చేసిన విధాన్ని భక్తులకు తెలిపారు. షిర్డిలోని కలరా జాడ్యంలో సాయిబాబా తిరగలిలో గోధుమలను విసిరి ఆ గోధుమ పిండిని షిర్డీ సరిహద్దుల్లో వేసిన తర్వాత షిర్డీ ప్రజల కలరా రోగం నివారించేందుకు సాయి లీలను అందరూ విని ఆనందం పొందారు. ఈ కార్యక్రమంలో లక్కడి జగన్మోహన్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



నాగోబా జాతర ప్రచార రథంపై చర్చిస్తున్న మెస్రం వంశీయులు



నేలపై తంబాకు వేసి మొక్కుతున్న కటోడ మెస్రం కోసేరావు, మెస్రం దాదారావులు

కేస్లాపూర్ నాగోబా జాతర ప్రచార యాత్ర షురూ

● ప్రచార రథం మార్గంపై చర్చించిన మెస్రం వంశీయులు ● సంప్రదాయ బద్ధంగా ప్రచార రథాన్ని సాగనంపిన మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతరను పుష్య మాస అమావాస్యను పురస్కరించుకొని ఈ నెల 28వ తేదీన మెస్రం వంశీయుల మహా పూజలతో నాగోబా జాతర ప్రారంభించనున్నారు. పుష్య మాసం ప్రారంభంలో కనిపించే నెలవంకను గురువారం రాత్రి మెస్రం వంశీయులు తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించి నాగోబా దేవత మహాపూజల వివరాలను తెలిపే నాగోబా జాతర ప్రచార రథ యాత్రను శుక్రవారం ప్రారంభించారు. ముందుగా కేస్లాపూర్ గ్రామంలోని పురాతన నాగోబా ఆలయం(మురాడి)లో మెస్రం వంశీయులు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు పటేల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి నాగోబా జాతర ప్రచార రథం బస చేసే తేదీలను ఖరారు చేశారు. ఈ నెల 10న పవిత్ర గంగాజలం కోసం పాదయాత్రతో బయల్దేరేందుకు నిర్ణయించారు. ప్రచార రథం(ఎడ్డుల బండిని) ఏడు రోజులపాటు ఏయే గ్రామాలకు వెళ్లాలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్ పటేల్ సమక్షంలో చర్చించారు. పురాతన నాగోబా ఆలయం (మురాడి)లో సంప్రదాయంగా ప్రత్యేక పూజలు చేసి రథాన్ని సాగనంపారు. ప్రచార రథాన్ని గ్రామ పొలిమేర వరకు మెస్రం వంశంలోని అల్లుడు తీసుకెళ్లగా, అక్కడ నుంచి కటోడ కోసేరావ్, ప్రధాన్ మెస్రం దాదారావ్ సంప్రదాయ రీతిలో నేలపై తంబాకు, బీడీలు వేసి అక్కడి నుంచి నాగోబాను మొక్కుకున్నారు. తర్వాత ప్రచార రథం (ఎడ్డుల బండి)లో కటోడ కోసు, ప్రధాన్ మెస్రం దాదారావ్ కుర్వేని గ్రామాల ప్రచారానికి బయలదేరి వెళ్లారు. కేస్లాపూర్ నుంచి ప్రారంభమైన ప్రచార రథం (ఎడ్డుల బండి) సిరికొండ మండలానికి చేరుకొని గుగ్గిల స్వామి ఇంటికి వెళ్లి పూజకు అవసరమయ్యే కుండల తయారీకి ఆదేశాలు ఇచ్చి సాయంత్రం రాజంపేట్ గ్రామానికి చేరుకొని రాత్రి అక్కడే బస చేసేందుకు నిర్ణయించారు. శనివారం రాజంపేట నుంచి కోలాడి, 5న కోలాడి నుంచి గుడిహత్నూర్ మండలం సోయంగూడ, 6న సోయంగూడ నుంచి ఇంద్రవెల్లి మండలం గిన్నెర, 7న గిన్నేరా నుంచి ఉట్నూర్ మండలం సాలేవాడ, 8న సాలేవాడ నుంచి ఇంద్రవెల్లి మండలం వడ్ గాం, 9న వడ్గాం నుంచి కేస్లాపూర్ లోని మడావి వంశం వారి ఇంటికి చేరుకొని బస చేయనున్నారు. కేస్లాపూర్ గ్రామానికి చేరుకోనే విధంగా నాగోబా జాతర ప్రచార సారథులకు మెస్రం వంశీయులు సూచనలు చేశారు. ఈ నెల 10న ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులు సమావేశమై గంగా జలం సేకరణ, రూట్ మ్యాప్‌పై చర్చిస్తారు. అదేరోజు పవిత్ర గంగా జలం కోసం పాదయాత్ర ప్రారంభించనున్నట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు పటేల్ తెలిపారు. జన్నారం మండలంలోని గోదావరి హస్తిన మడుగు నుంచి సేకరించి తీసుకొచ్చిన పవిత్ర గంగా జలంతో ఈ నెల 28న మెస్రం వంశీయులు మహాపూజతో నాగోబా జాతర ప్రా రంభించనున్నారు. ఈ కార్యక్రమంలో మెస్రం చిన్ను పటేల్, కటోడ మె స్రం కోసేరావు, మెస్రం దేవ్ రావు, మెస్రం శేఖర్‌బాబు, మెస్రం తుకారం, మెస్రం నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట మూసి ఉన్న మహిళ శౌచాలయం

ఆలోచన భేష్.. అమలులో తుస్

ఆదిలాబాద్ పట్టణంలోని రద్దీ ప్రాంతాలు, జన సంచారం ఎక్కువగా ఉండే ఏరియాల్లో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన శౌచాలయాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. లక్షల రూపాయలు వెచ్చించి కట్టిన ఈ సులబ్ కాంప్లెక్స్‌లు ఇప్పుడు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. పాత మున్సిపల్ ఆఫీస్‌ను ఆనుకుని మహిళా శౌచాలయం నిర్మించగా చాలారోజులుగా అది పని చేయడం లేదని, ఎప్పుడు వెళ్లినా తాళం వేసి కనిపిస్తుందని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టరేట్‌కు వెళ్లే రహదారిలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన శౌచాలయానిది దాదాపు అదే పరిస్థితి. ఒక మంచి ఆలోచనతో నిర్మించిన ఈ శౌచాలయాలు ప్రజలకు అందుబాటులో లేకుండా పోవడం పలు విమర్శలకు తావిస్తుంది.

(ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



కలెక్టరేట్ సమీపంలోని తాళం వేసి ఉన్న పబ్లిక్ టాయిలెట్

ఏరియా ఆస్పత్రి రోగులను ప్రైవేట్‌కు తరలిస్తే సహించేది లేదు



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్

భైంసా, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవల నిమిత్తం ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించుకపోతే సహించేది లేదని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ వెల్లడించారు. శుక్రవారం భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో తనిఖీలు చేపట్టిన సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి పలు హెచ్చరికలు జారీ చేశారు. కొంత మంది వైద్యులు ఇక్కడి వచ్చే రోగులను తమ తమ ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించుక పోతున్నట్లుగా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఈ విధానాలకు సంబంధిత వైద్యులు స్వస్తి పలికితే శ్రేయస్కరంగా ఉంటుందని వెల్లడించారు. తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఇదే క్రమంలో వైద్యాధికారులు , సిబ్బంది సమయ పాలన పాటిస్తూ రోగులకు సకాలంలో మెరుగైన రీతిలో వైద్య సేవలు అందించాలని తెలిపారు. విధుల నిర్వహణ పట్ల ప్రతిఒక్కరూ నిక్కచ్చిగా వ్యవహరించాలన్నారు. ఎంత మాత్రం అలసత్వ విధానాలను అవలంభించిన సహించబోమని తేల్చిచెప్పారు. ఆసుపత్రికి చెడ్డపేరు తెచ్చేలా ఎవరు వ్యవహరించిన ఉపేక్షించబోనని వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ వార్డులలో కలియ తిరిగి ఆయా విభాగాల్లో చికిత్సలు పొందుతున్న రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవల విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సమావేశపు గదిలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇందులో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కాశీనాథ్‌తో పాటు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాసరను విస్మరిస్తే దీక్ష చేస్తా

● ముథోల్ ఎమ్మెల్యే రామారావు పాటిల్

బాసర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బాసరకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసే వరకు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అమ్మవారి ఆలయ అభివృద్ధి నిధులు రూ. 42 కోట్లు వచ్చే వరకు ఊరుకునేది లేదని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పాటిల్ చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే అవసరమైతే బాసర కోసం దీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు శుక్రవారం తనను కలిసిన బాసర గ్రామస్థులకు స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ అంశాలపై ప్రభుత్వంతో చర్చించినట్లు అసెంబ్లీలో కూడా ప్రస్తావించినట్లు ఆయన గుర్తు చేశారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం పెండింగ్‌లో ఉన్న స్థల ఎంపిక ప్రక్రియ కొనసాగడంపై గ్రామస్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పక్కా భవనాలు నిర్మాణాలు అయ్యే వరకు, భవనాలు గ్రామస్థుల నుంచి ఏర్పాటు చేస్తే కేంద్రీయ విద్యాలయం ప్రారంభించుకునే అవకాశాన్ని గ్రామస్తులకు సూచించారు. గ్రామ పెద్దలు ఆలోచించి ఒక భవనాన్ని సిద్ధం చేసేలా చూడాలని కోరారు. ఆసర ఆలయ అభివృద్ధి జరిగేలా ప్రయత్నిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. బాసర అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రామరావు పటేల్‌ను గ్రామస్థులు సత్కరించి సన్మానించారు.

బోథ్ బస్టాండ్ ప్రహరీ నిర్మాణంపై నీలినీడలు

● వ్యాపారుల ఒత్తిడితోనే నిలిచిపోతుందని ఆరోపణలు



ప్రహరీ నిర్మాణానికి కొలతలు తీస్తున్న అధికారులు

బోథ్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మాణం మూడు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా ఉంది. బస్టాండు స్థలంలో ఆక్రమణలు ఉండడంతో పాటు నిర్మించిన వ్యాపార సముదాయాలకు వాహనాలు తిరిగేందుకు స్థలం ఉండకపోవడంతో వ్యాపారుల ఒత్తిడితో అధికారులు స్థానిక నాయకులు ప్రహరీ నిర్మాణంపై చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు అన్న విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి ప్రహరీ నిర్మించినట్లయితే వ్యాపార వర్గాల వారికి నష్టం జరిగే ఆస్కారం ఉంది. అయితే వ్యాపార వర్గాల వారు ప్రహరీ నిర్మాణానికి అడ్డుపడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇటీవల ప్రహరీ నిర్మించి తీరుతామంటూ కొలతలు తీయించారు. అయితే ప్రహరీ నిర్మాణం కొలతలకే పరిమిత మైందా లేక నాయకులు వ్యాపారుల ఒత్తిడికి ప్రహరీని మరిచిపోతున్నారా అని పలువురు పట్టణ వాసులు పేర్కొంటు న్నారు. ఇకనైనా బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మించి ఆర్టీసీ బస్సులు తిరిగేందుకు బయటి వాహనాలు లోపలికి రాకుండా ఉండే విధంగా చూడాల్సిన అవసరం ఉంది.

చండీ యాగంలో పాల్గొన్న కంది దంపతులు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి తన సతీమణి కంది మౌనారెడ్డితో కలిసి ఆయుత చండీయాగంలో పాల్గొన్నా రు. 12 రోజులుగా ఆదిలాబాద్‌లో జరుగుతున్న విశ్వశాంతి మహాయాగానికి కంది శ్రీనివాసరెడ్డి సతీసమేతంగా హాజరై హోమ గుండం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని చండీ అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.



చండీయాగం నిర్వహిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

బాసరలో డీపీవో తనిఖీ



ఆలయం వద్ద తనిఖీ చేస్తున్న డీపీవో శ్రీనివాస్

బాసర, జనవరి, 3: (ఆంధ్రజ్యోతి): బాసర మండల కేంద్రంలో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ తనిఖీ నిర్వహించారు. పన్నుల వసూలు ప్రక్రియను పరిశీలించారు. సరస్వతి అమ్మవారి ఆలయం వద్ద గల వ్యాపార సంస్థల్లో తనిఖీ చేసి చెల్లించిన, బకాయి పన్నుల గురించి తనిఖీ చేశారు. ప్రతీ ఒక్క వ్యాపారి లైసెన్స్ తీసుకోవాలని, సకాలంలో పన్నులు చెల్లించాలని సూచించారు. అంతకుముందు డీపీవో శ్రీనివాస్ సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట డీఎల్‌పీవో సుదర్శన్, బాసర గ్రామ పంచాయతీ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సోన్‌లో ఆంగ్ల పాటల పోటీలు

సోన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలమాన పరిస్థితుల దృష్ట్యా ప్రతీ విద్యార్థి ఆంగ్ల భాషలో ప్రావీణ్యం పొందాలని తద్వారా పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. తెలంగాణ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసి యేషన్ (ఎల్టా) సోన్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పా ఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన ఉపన్యాస, ఆంగ్లప్రతిభా పాటవ పోటీలను ఆయన ప్రారంభిస్తూ ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంగ్ల భాషలో పరిజ్ఞానం తప్పనిసరైందన్నారు. ఉపన్యాస పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను చైత్ర (కడ్తాల్), సయ్యద్ హైమాన్ (సోన్), పూజిత (పాక్‌పట్ల) గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రమాదేవి, ఆంగ్ల ఉపాధ్యాయులు చంద్రశేఖర రావు, లింగారెడ్డి, శైలజ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT NIRMAL SUMMONS FOR APPEARANCE OF THE DEFENDANTS
O.S.NO.14 OF 2015

Between:-
Smt.Menga Bhagirtha. ..Plaintiff
And
Donikela Rajeshwar @ Donkanti Rajeshwar and others ...Defendant

To
D.No. 29: Mohammad Sayeed S/o. Late Mohammad Sajid Ali, aged 21 years, Occ: Student, R/o. H.No. 5-3-99, Kabutar Kaman, Nirmal-504106, Cell No. 9381893730

WHEREAS the plaintiff has instituted a suit against you & others for declaration of title and recovery of possession of the suit Schedule properties, you are hereby summoned to appear in this Court in person or by a pleader duly instructed and able to answer all material question relating the suit or who shall be appointed by some other person able to give answer all such question on this 24th day of January, 2025 at 10.30 AM to answer claim and you are directed to produce on that day all the documents upon which you intend to reply in support of your defense.

Take notice that in default of appearance on the day afore mentioned otherwise the suit will be heard and determined in your absence.

=// BY ORDER OF THE HON'BLE COURT DATED: 02-01-2025 //=
Sd/- B. SHUBHAKARAN
B.Sc., LL.B. Advocate
H.No. 5-11-95/3, Priyadarshini Nagar, NIRMAL.

స్ఫూర్తిదాయకం.. సావిత్రీబాయి పూలే

● ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైస్ చాన్స్‌లర్

బాసర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాను సారం ఆర్జీయూకేటీలో సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం ఘనం గా నిర్వహించారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీ దర్శన్‌తో కలిసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లా డుతూ మహిళా విద్య, సామాజిక సంస్కరణలను సావిత్రిబాయి పూలే చేసి న విశేష కృషిని కొనియాడారు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా ఆమె వారసత్వ ప్రాముఖ్యతను తెలిపారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తి నేటికి కొనసాగడం వల్ల మనదేశంలో బాలికల విద్య గణనీయంగా పెరిగింది. చదువుల్లో ఉద్యోగాల్లో అమ్మాయిలు గొప్పగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ మురళీ దర్శన్ మాట్లాడుతూ సామాజిక అన్యాయాలకు వ్యతిరేకం గా పోరాడడంలో సావిత్రిబాయి పూలే ధైర్యం, సంకల్పాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏవో ఇంచార్జీ డాక్టర్ నాగరాజు, అసోసియేట్ డీన్స్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మహేష్, డాక్టర్ విట్టల్, కార్యక్రమం నిర్వాహకులు,డాక్టర్ రాములు, మహిళా ఉద్యోగులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మహిళా టీచర్లకు సన్మానం

నిర్మల్ అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలను జుమ్మెరాత్‌పేట్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో రామారావు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ... ప్రతి ఉపాధ్యాయుడు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఆమె తన జీవితాన్ని పేద పిల్లలకు అక్షరాభ్యాసం చేసేందుకు అంకితం చేశారన్నారు. అప్పటి ఆచార సాంప్రదాయాలను పక్కనపెట్టి ప్రతీఒక్కరికి విద్య అందాలన్న ఆశయంతో ఆమె ముందుకు సాగి స్ఫూర్తిగా నిలిచారన్నారు. అనంతరం మహిళా టీచర్లు డి. నాగలత, హిమబిందులను డీఈవో రామారావు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ అల్లం రవిబాబుతో పాటు టీచర్లు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలికి సన్మానం చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హార్ట్‌ఫుల్ మెడిటేషన్ కార్యక్రమం



విద్యార్థులకు ఒత్తిడి పట్ల అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లోకేశ్వరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ కే.గౌతమ్ ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్ మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శిక్షకులుగా షరీఫ్, శ్రీకాంత్, హుస్సేన్ పాల్గొని విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయాన్ని పోగొట్టేలా, ఒత్తిడికి కారణాలు, టైం మేనేజ్మెంట్, ఒత్తిడిని ఎలా జయించాలని, భయానికి గల కారణాలు, మానసిక ధైర్యాన్ని ఎలా పెంపొందించుకోవాలన్న విషయాలపై సమగ్రంగా వివరించారు. ధ్యానం పట్ల అవగాహన, ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలు, ఆరోగ్య పరిరక్షణ, తల్లిదండ్రులపై ప్రేమ, గౌరవం, అధ్యాపకులు, అతిథుల పట్ల సంస్కారం, హృదయం పట్ల ఒత్తిడి ఎలా అదుపులో ఉంచుకోవాలో, భవిష్యత్తులో ఏర్పాటు చేసు కోవలసిన లక్ష్యాలు, అనుకున్నది సాధించడానికి గల కృషి, పట్టుదల, వ్యస నాలను వదిలించుకోవడం పట్ల సాధన, ఇతర విషయాలు పిల్లలకు ధ్యానం చేయిస్తే చెడును పారదోలి మంచిని పరీక్షిస్తూ మన హృదయాన్ని ఎలా అదుపులో ఉంచుకోవాలో కూలంకషంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జి.శ్రీనివాస్, విఠల్, వెంకటేశ్వర్, వినోద్ కుమార్, ప్రమీల రాణి, నవీన్, చిన్నయ్య, మహేందర్, సాయినాథ్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మెడిటేషన్‌తో మానసిక ఒత్తిడి దూరం: డాక్టర్ షరీఫ్

దిలావర్‌పూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మెడిటేషన్ చేయడం ద్వారా ఒత్తిడి నుంచి బయట పడవచ్చని ప్రముఖ మానసిక వైద్యుడు డా. షరీఫ్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా డా. షరీఫ్ మాట్లాడుతూ... విద్యార్థులు సాధారణంగా పరీక్షల సమయంలోనే ఒత్తిడికి లోనవుతారని, అయితే ఆ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు మెడిటేషన్ చాలా ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు వివిధ కారణాలతో మానసిక ఒత్తిళ్లకు లోనై ఆత్మహత్యల వరకు వెళ్తున్నారని ఇది మంచిది కాదన్నారు. సమస్యలను ఆత్మ విశ్వాసంతో ధైర్యంగా ఎదుర్కొంటేనే భవిష్యత్తు జీవితం బంగారు మయమవుతుందన్నారు. విద్యార్థులు ముందుగా నా వల్ల కాదు అనే అభిప్రాయం నుంచి బయటకు రావాలన్నారు. అలాంటి ఆలోచన నుంచి బయటపడేయడానికే హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ ప్రోగ్రాం రూపొందించబడిందన్నారు. ప్రతి విద్యార్థి ప్రతీరోజు 30 నిమిషాల పాటు మెడిటేషన్ చేయాలని సూచించారు. తద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఉత్సాహంగా, ఉల్లాసంగా జీవితాన్ని కొనసాగించవచ్చన్నారు. మీరు ప్రయత్నించి చూస్తే మీకే అనుభవమవుతుందన్నారు. అలాగే విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.సుదర్శన్, శ్రీకాంత్, స్టూడెంట్స్ కౌన్సిలర్లు కృష్ణ, అనసూయ పాల్గొన్నారు.



● అధ్వానస్థితిలో ఉన్న గడ్డెన్న వాగు ప్రాజెక్టు కాలువ



● ప్రధాన కాలువలో పేరుకుపోయిన తుంగ

కాలువలపై పట్టింపు ఏదీ!?

- జిల్లాలో అధ్వానంగా సాగు నీటి కాలువల పరిస్థితి
- కాలువల మరమ్మతులకు నిధుల కొరత
- పదేళ్ల నుంచి పైసా మంజూరు లేదు
- సరస్వతి, స్వర్ణ, కడెం, సదర్మాట్ కాలువలది అధోగతి
- ప్రతియేటా చివరి ఆయకట్టుకు అందని నీరు

నిర్మల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దాదాపు 60 వేల ఎకరాలకు సాగునీరు అందించే పలు సాగు నీటి కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. ముఖ్యంగా ప్రధాన ప్రాజెక్టుల పరిధిలోని ఈ కాలువలకు దాదాపు 10 ఏళ్ల నుంచి సరైన మరమ్మతులు జరగకపోతున్న కారణంగా చివరి ఆయకట్టు వరకు సాగు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతియేటా ఖరీఫ్, రబీ సీజన్‌లలో చివరి ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఆందోళనలు చేస్తుండడం సహజంగా మారింది. వర్షాలు, వరదల కారణంగా ఈ కాలువలు పూర్తిగా దెబ్బతింటూ శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అయితే ఈ కాలువలకు మరమ్మతులు చేపట్టాల్సిన నీటి పారుదల శాఖ నిధుల కొరత కారణంగా తూతూ మంత్రపు చర్యలతో సరిపెడుతోందన్న ఆరోపణలున్నాయి. చాలా కాలువలకు లైనింగ్‌లన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. కాలువల నిండా మొలిచిన పిచ్చి మొక్కలు నీటి ప్రవాహానికి ఆటంకాలు సృష్టిస్తున్నాయంటున్నారు. అండర్ టెన్నెల్, సూపర్ ప్యాసేజ్, డిస్ట్రిబ్యూటర్ల మరమ్మతులు శాశ్వత ప్రాతిపదకన కాకుండా నామమాత్రపు చర్యలతో అధికారులు చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలున్నాయి. అయితే ప్రభుత్వం ప్రతిఏటా ప్రాజెక్టులకు అలాగే వాటి పరిధిలోని కాలువల మరమ్మతులకు నిధులు సక్రమంగా మంజూరు చేయకపోతుండడంతోనే ఈ సమస్య ఏటేటా తీవ్రమవుతోందంటున్నారు. అధికారులు మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి సర్కార్‌కు పంపుతుననప్పటికీ సర్కార్ నుండిమాత్రం ఎలాంటి స్పందన కనిపించడం లేదన్న ఫిర్యాదులున్నాయి. వార్షిక నిధులతో మాత్రమే కాలువలకు చిన్న చిన్న మరమ్మతులు చేసి అధికారులు తమ పని పూర్తయిందనిపిస్తున్నారు. అయితే దాదాపు పది ఏళ్ల నుంచి ఈ కాలువలకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు జరగకపోవడానికి గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్న ఆరోపణలున్నాయి.

దయనీయంగా ప్రధాన కాలువలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని సరస్వతి కాలువ నిర్మల్ జిల్లాలో దాదాపు 28 వేల ఎకరాలకు సాగు నీరందిస్తోంది. సోన్, నిర్మల్, లక్ష్మణ చాంద, మామడ మండలాలతో పాటు కడెం, ఖానాపూర్ మండలాలకు సైతం ఈ కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. అయితే ఈ కాలువకు 2001 నుంచి 2004 వరకు దాదాపు 36 కోట్ల రూపాయలతో మరమ్మతు పనులు చేపట్టారు. అప్పట్లో జపాన్ నిధులతో ఈ మరమ్మతు పనులు పూర్తి చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ కాలువకు ఎలాంటి పూర్తిస్థాయి మరమ్మతులు జరగలేదు. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా సరస్వతి కాలువ మరమ్మతులకు సంబంధించి నిధుల విడుదల విషయంలో పూర్తిగా నిర్లక్ష్య ధోరణి అవలంబించింది. అధికారులు పంపే ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసిందన్న విమర్శలున్నాయి. దీని కారణంగానే సరస్వతి కాలువకు చాలా చోట్ల బుంగలు పడడం అలాగే లైనింగ్, కట్ట కొట్టుకుపోవడం ప్రతియేటా జరుగుతోందంటున్నారు. అంతా మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరుకుందని రైతులు పేర్కొంటున్నారు. ఒకటవ నెంబర్ డిస్ట్రిబ్యూటరీ నుంచి 26 నెంబర్ డిస్ట్రిబ్యూటరీ వరకు ఈ కాలువ ద్వారా మొత్తం 21 వేల 874 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందాల్సి ఉంది. అలాగే కడెం ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే 27, 28వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీలకు సైతం ఈ కాలువ ద్వారా దాదాపు 7వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉన్నప్పటికీ మరమ్మతులు లేని కారణంగా లక్ష్యం నెరవేరడం లేదు.

మిగతా కాలువలది ఇదే పరిస్థితి

జిల్లాలోని స్వర్ణ ప్రాజెక్టు పరిధిలో గల స్వర్ణ కాలువ, అలాగే గడ్డెన్న వాగు ప్రాజెక్టు పరిధిలోని గడ్డెన్నవాగు కుడి, ఎడమ కాలువలు, సదర్మాట్ ఆనకట్ట పరిధిలోని కాలువల పరిస్థితి కూడా మరమ్మతులు లేక అధ్వానంగా మారాయని అంటున్నారు. చాలా చోట్ల నిర్మాణాలు కొట్టుకుపోయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. ముఖ్యంగా కాలువల మధ్యలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్తా చెదారం, పూడికతో పాటు పిచ్చిమొక్కల కారణంగా నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని అంటున్నారు. ఏళ్ల నుంచి ఈ కాలువలకు మరమ్మతులు చేయకపోతుండడంతో రోజురోజుకు ఇవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని చెబుతున్నారు. రబీ సీజన్‌లో నీటి ప్రవాహ ఉధృతి తక్కువగా ఉంటుండడంతో పంటలకు నీరందించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలువలో పిచ్చి మొక్కలు తొలగించాలి

: ఏలేటి చిన్న లింగారెడ్డి, రైతు, గ్రామం కొరిటికల్



ఏళ్ల గడుస్తున్నా పనులు చేయకుండా కాలయాపన గడుపుతున్న దుస్థితి సరస్వతి కాలువలో కనబడుతుంది. పిచ్చి మొక్కలు, తుంగ మొలిచి నీళ్ల వెళ్లడానికి ఆటంకం కలుగుతున్న ఎస్సారెస్పీ అధికారులు గానీ ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో రైతులు నీరు అందేందుకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. అధికారులు స్పందించి ఇకనైనా పనులు చేయించాలని కోరుతున్నాము.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో రామారావు

సర్వశిక్షా టీచర్ల సమ్మెతో పేద విద్యార్థులకు అన్యాయం

● మానవతా దృక్పథంతో సమ్మె విరమించాలి : డీఈవో

నిర్మల్ అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష పరిధిలోని కేజీబీవీలలో పని చేస్తున్న టీచర్లంతా వెంటనే తమ సమ్మెను విరమించి పేద విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని నిర్మల్ జిల్లా విద్యాధికారి రామారావు కోరారు. ఈ మేరకు జుమ్మెరాత్‌పేట్ హైస్కూల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో మాట్లాడారు. ప్రజా స్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని అయితే పేద విద్యార్థుల భవిష్యత్తును పరిగణలోకి తీసుకోకుండా గత 25 రోజుల నుంచి సమ్మె చేయడం సమంజసం కాదన్నారు. పేద పిల్లలకు విద్యాబోధన అందించేందుకు సావిత్రిబాయి పూలే తన జీవితాన్నే త్యాగం చేసిన విషయాన్ని కేజీబీవీ టీచర్లు విస్మరించవద్దన్నారు. కేజీబీవీలలో విద్యార్థులకు బోధన కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అవసరమైతే రెగ్యులర్ టీచర్లను డిప్యూటేషన్‌పై తీసుకొని తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కేజీబీవీ టీచర్లదేనన్నారు. కేజీబీవీ టీచర్లు ఇప్పటికైనా తమ మొండి పట్టుదలను వీడి పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సమ్మెను విరమించాలని కోరారు. మొండిగా వ్యవహరిస్తే ప్రత్యామ్నాయ టీచర్లతో బోధన కొనసాగించాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతుందన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తుపై ఆలోచన చేయాలని కోరారు. కేజీబీవీ టీచర్ల సమ్మెను విరమింపజేసేందుకు ఉపాధ్యాయ సంఘాలు చొరవ తీసుకోవాలన్నారు. కేజీబీవీలలో ఆటంకాలు లేకుండా విద్యాబోధన సాగించేందుకు కూడా అన్ని ఉపాధ్యాయ సంఘాలు, సబ్జెక్టు సంఘాల నాయకులు సహకరించాలని కోరారు.

● ఎల్టా ఆధ్వర్యంలో అర్బన్ స్థాయి పోటీలు

నిర్మల్ అర్బన్: ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్ అండ్ ఎల్లోకేషన్ నిర్మల్ అర్బన్ స్థాయి పోటీలను స్థానిక జుమ్మెరాత్‌పేట్ హైస్కూల్‌లో డీఈవో రామారావు ప్రారంభించారు. మొదట ఇంగ్లీష్ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలను డీఈవో విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఇంగ్లీష్ భాషా ప్రాధాన్యత రోజురోజుకు విస్తరిస్తోందన్నారు. ఆ తర్వాత అర్బన్ మండల స్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్ పోటీల విజేతలకు స్కూల్ హెడ్ మాస్టర్ అల్లం రవిబాబుతో పాటు ఇంగ్లీష్ టీచర్లు బహుమతులు అందజేశారు. ఒలంపియాడ్ పరీక్షల్లో జుమ్మెరాత్‌పేట్ హైస్కూల్‌కు చెందిన ఏ.శ్రీహరి మొదటి స్థానం దక్కించుకోగా అలాగే ఇదే పాఠశాలకు చెందిన ఎం.మిత్రబిందు రెండవ స్థానం దక్కించుకుంది. అలాగే గర్ల్స్ హైస్కూల్‌కు చెందిన జాఫ్రీన్ సనుబర్ మూడవ స్థానంలో నిలిచారు. ఉపన్యాస పోటీలలో అస్రా కాలనీ హైస్కూల్‌కు చెందిన అర్షియా బేగం మొదటిస్థానం, జుమ్మెరాత్‌పేట్ హైస్కూల్‌కు చెందిన ఎం.మధుప్రియ రెండవ స్థానం, అలాగే అస్రా కాలనీ హైస్కూల్‌కు చెందిన జోయా హర్షిన్ మూడవ స్థానంలో నిలిచారు. వీరందరికి బహుమతులు అందజేశారు. ఇందులో ఎల్టా జిల్లా అధ్యక్షుడు కదార్ల రవీంద్ర, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, రిటైర్డ్ సీనియర్ ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ డేవిడ్, గంగన్న, ఇంగ్లీష్ టీచర్లు ఇర్ఫాన్ షేక్, ఖమర్ ఉల్లా, రమణ, లక్ష్మీనారాయణ, ముత్తన్న, హిమబిందు, దత్తురాం, గంగాధర్ భోస్లే, ఉజ్వల, తదితరులున్నారు.

నేరాల అదుపునకే కార్డన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సైలు

కుంటాల, జనవరి, 3: (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో నేరాలను అదుపుచేసేందుకు కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ సైలు అన్నారు. శుక్రవారం మండలంలోని అంబకంటి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కుభీర్, కుంటాల ఎస్సైలు, 25 మంది పోలీసు సిబ్బంది పాల్గొని గ్రామాన్ని మొత్తం అదుపులోకి తీసుకొని గ్రామంలో వాహనాలను తనిఖీ నిర్వహించారు. 95 ద్విచక్రవాహనాలు, 2 ఆటోలను సరైన పత్రాలు లేని కారణంగా స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏ బ్యాంకు అధికారి కూడా వినియోగదారులకు ఓటీపీ అడగరని వివరాలు అడిగితే చెప్పకూడదని సూచించారు.

చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

నిర్మల్ రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో చోరీకి పాల్పడిన దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ రాజేష్ మీనా, ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. వారి వివరాల ప్రకారం... మండలంలోని భాగ్యనగర్, న్యూ పోచంపాడ్ గ్రామానికి చెందిన ముప్పాల రాకేష్ రెడ్డి(32) గత సంవత్సరం నవంబరు నెలలో బుధవార్‌పేట్ హనుమాన్ మందిరంలోకి వెళ్లి హనుమాన్ విగ్రహం కళ్లకు అమర్చిన వెండి కళ్లను దొంగతనం చేయగా పట్టుకొని నేరస్తుడిని రిమాండ్‌కి తరలించి జైలుకు పంపారు. అతను బెయిల్‌పై బయటకు వచ్చి జనవరి 1న రాత్రి బస్టాండ్ ఏరియాలో ఒక టైర్ల షాపులో రెండు కొత్త టైర్లు, గాంధీ మార్కెట్‌లోని స్టాండర్డ్ ఎలక్ట్రానిక్ షాపులో ఒక కొత్త ఫ్యాన్, అక్కడే మరో షాపులో షట్టర్ తాళం పగలగొట్టి అందులోని యాభై కిలోల పచ్చి మిరపకాయల బ్యాగ్‌ను దొంగలించి తీసుకెళ్తుండగా సయ్యద్ యాసఫ్ చూసి నేరస్తుడిని దొంగ వస్తువులతో సహా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

పీసీసీ చీఫ్‌తో ముథోల్ మాజీఎమ్మెల్యే భేటీ



పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన ముథోల్ మాజీ ఎమ్మెల్యే

భైంసా, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో శుక్రవారం ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి బేటి అయ్యారు. హైదరాబాద్‌లోని పీసీసీ భవన్‌లో కరీంనగర్ గ్రంథాలయాల సంస్థ ఛైర్మెన్ సత్తు మల్లేష్‌తో కలిసి ఆయన పీసీసీ చీఫ్‌ను కలిసారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ ముథోల్ నియోజక వర్గ పరిధిలోని రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ స్థితి,గతులు, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలపై ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో చర్చించినట్లుగా సమాచారం.

ఆర్జీయూకేటీలో పుస్తకావిష్కరణ

బాసర, జనవరి, 3: (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీలో పీయూసీ 2 చదువుతున్న బానోతుమోహన్ రచించిన ద పీరియడ్ ఆఫ్ 2024 పుస్తకాన్ని శుక్రవారం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ ఆవిష్కరించారు. ఈ పుస్తక సహ రచయితలుగా కే.హేమన్, ఆజ్మీర చరణ్, ఎన్, శశి వర్ధన్, పుస్తక రచనలో సహాయ సహకారాలు అందించారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ విద్యార్థులను అభినందించారు. గొప్పసంకల్పంతో పుస్తక రచన చేయడం అరుదైన విషయమని తెలిపారు. ఈ పుస్తకంలో ప్రధానంగా 2024 లో జరిగిన ప్రధానమైన ఘట్టాలు, విశేషాంశాలు, అంతర్జాతీయ, జాతీయ రాష్ట్రీయ ప్రాంతీయ క్రీడా బిజినెస్ రంగాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా పథకాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలతో రచించడం గొప్ప ఆలోచన విధానమని వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ప్రతిభా నైపుణ్యాలు అత్యంత అద్భుతమైనవని కొనియాడారు.

బాలల భవిష్యత్ కోసమే ఆపరేషన్ స్మైల్

నిర్మల్ రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : బాలల భవిష్యత్ కోసమే ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆపరేషన్ స్మైల్ ఇన్‌చార్జి సబ్‌ఇన్‌స్పెక్టర్ సాధి హుస్సేన్ తెలిపారు. ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ సమీపంలో గల ఐకే రెడ్డి చౌరస్తాలో మెకానిక్ దుకాణంలో సోదాలు నిర్వహించగా, ఇద్దరు మైనర్లు చట్ట విరుద్ధంగా పని చేస్తున్నట్లు గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలల్లో చేర్పించడం జరిగిందని తెలిపారు.

డీసీఎంఎస్ సెంటర్లకు ఇచ్చిన ఎన్‌వోసీలను రద్దు చేయాలని వినతి

దిలావర్‌పూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గతంలో డీసీఎంఎస్ సెంటర్లకు ఇచ్చిన ఎన్‌వోసీలను వెంటనే రద్దు చేయాలని నిర్మల్ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షుల సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా సహకార అధికారికి వినతి పత్రం అందజేశారు. పీఏసీఎస్‌ల ప్రధాన ఆర్థిక వనరులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలేనని, అయితే పీఏసీఎస్‌లకు ధాన్యం కేంద్రాలను తగ్గించి ఐకేపీ, డీసీఎంఎస్‌లకు కేటాయించడం వల్ల పీఏసీఎస్‌ల ఆదాయం తగ్గిపోయి సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 44 ద్వారా పీఏసీఎస్ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించడంతో పెరిగాయని అన్నారు. దీంతో పీఏసీఎస్‌ల ఆర్థిక పరిస్థితి దిగజారిపోయి వేతనాలు చెల్లించలేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా గతంలో డీసీఎంఎస్‌లకు ఇచ్చిన ఎన్‌వోసీలను రద్దు చేయాలని వారు కోరారు.

ఉరి వేసుకొని ఒకరి మృతి

కుబీర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్‌కు చెందిన బత్తిని గంగారాం(72) అనే వృద్ధుడు మద్యం మత్తులో ఉరి వేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. మృతుడు గతకొద్ది రోజులుగా అనారోగ్యం కారణంగా బాధపడుతున్నడని, ఆసుపత్రిలో చూపించినా నయం కాలేదు. గురువారం మద్యం మత్తులో చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చెప్పారు.

సొసైటీ ఏర్పాటు చేయాలని వినతి

సారంగాపూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల బీరవెల్లిలో రైతు సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని శుక్రవారం సొసైటీ ఛైర్మన్లు నారాయణ్ రెడ్డి, మాణిక్ రెడ్డి, మాజీ అడెల్లి పోచమ్మ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, భూమారెడ్డిలు సహకారం సంఘం జిల్లా అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైకుంఠపూర్, ప్యారమూర్, తాంద్ర, కంకెట, బీరవెల్లి, వంజర్ గ్రామాలకు ఆలూర్ సొసైటీకి వెళ్లడానికి రవాణా సౌకర్యం లేకపోవడంతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ఎమ్మార్సీల నిర్వహణ పనులకు ఉపాధ్యాయులు

- ఒక్కో ఎమ్మార్సీకి ఇద్దరు ఉపాధ్యాయుల కేటాయింపు
- తాత్కాలికంగా విధులు నిర్వహించేందుకు ఉత్తర్వులు



భైంసా ఎమ్మార్సీకార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



భైంసాలోని ఎమ్మార్సీ కార్యాలయం

భైంసా, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా సిబ్బంది నిరవధిక సమ్మెతో నెలకొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రత్యామ్నాయ విధానాల ద్వారా ఒక్కో సమస్యను పరిష్కరించే దిశగా చర్యలను ముమ్మరం చేసింది. ఇప్పటికే కేజీబీవీల్లో నిర్వాహణకు ప్రత్యామ్నాయ ప్రత్యేక అధికారులను, బోధనకు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఏర్పాటు చేసిన ప్రభుత్వం అదే విధానాన్ని మండల వనరుల కేంద్రా (ఎమ్మార్సీ)ల్లోనూ అమలులోకి తీసుకవచ్చింది. ఎమ్మార్సీ కేంద్రాల్లో ఒప్పంద పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా సిబ్బంది సమ్మె చేస్తుండటంతో వాటిల్లో కూడా ప్రత్యామ్నాయ చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగానే ఎమ్మార్సీల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి నిర్వాహణ వ్యవస్థను మెరుగు పరచేందుకు గాను ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను నియమించాలని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఈవీ నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి ఎమ్మార్సీకి ఇద్దరు స్ట్రాంగ్ ఉపాధ్యాయులను నియమించాలని ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా జిల్లా విద్యాధికారి రామరావ్ ఇక్కడి 19 ఎమ్మార్సీలకు స్ట్రాంగ్ ఉపాధ్యాయులను కేటాయించారు.

● ఎమ్మార్సీలకు ఇద్దరేసి ఉపాధ్యాయులు .

జిల్లాలో 100 మందికి పైగా సమగ్ర శిక్షా ఉద్యోగులు ఒప్పంద పద్ధతిపై విధులు నిర్వహిస్తున్నారు. వారంతా తమ సమస్యల పరిష్కారం, డిమాండ్లు నెరవేర్చుకునేందుకు గాను నిరవధిక సమ్మె బాట పట్టడంతో మండల వనరుల కేంద్రాల్లో కార్యకలపాలు స్తంభించి పోయాయి. . వంట ఏజెన్సీల బిల్లుల తయారీ, నమోదు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనుల వివరాలు, పాఠ్య, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తుల కేటాయింపు, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు, కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలు, మార్కుల వివరాల నమోదు ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో మండలంలోని పాఠశాలల్లో అదనంగా ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులను వెంటనే ఎమ్మార్సీలకు డిప్యూటేషన్‌పై పంపాలని నిర్ణయించారు. మండల వనరుల కేంద్రాల్లో నిర్వహించే అన్ని పనులను ఇద్దరు స్ట్రాంగ్ టీచర్లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. సమగ్ర శిక్షా సిబ్బంది సమ్మె ముగిసే వరకు వీరు విధుల్లో ఉంటారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రతి మండలంలో ఇద్దరు స్ట్రాంగ్ టీచర్లను నియమించామని డీఈవో రామరావ్ పేర్కొన్నారు. రెండు రోజులుగా స్ట్రాంగ్ టీచర్లు తమకు కేటాయించిన ఎమ్మార్సీల్లో విధులను నిర్వహిస్తున్నారని తెలిపారు.

బీసీలపై బీఆర్ఎస్ కపట ప్రేమ

● భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్

భైంసా, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలం అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ బీసీలకు అన్ని విధాలుగా వంచించిందని, వారికి దక్కాల్సిన నిధులకు వెచ్చించకుండా నిట్ట నిలువునా ముంచిందని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ విమర్శించారు. శుక్రవారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ దత్తురామ్ పాటిల్‌తో కలిసి మాట్లాడారు. అధికారంలో ఉన్న సమయంలో బీసీల సంక్షేమాన్ని కల్వకుంట్ల కుటుంబం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. అధికారం కోల్పోయిన పిదప బీసీల అభ్యున్నతిపై కపట ప్రేమ నాటకాలకు తెరలేపి మొసలి కన్నీరు కారుస్తోందని ధ్వజమెత్తారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు దుకాణాలు దగ్ధం

● రూ. లక్షల్లో ఆస్తినష్టం ● బాసరలో ఘటన

బాసర, జనవరి, 3 : (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలో షార్ట్ సర్క్యూట్‌తో రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. బస్టాండ్ సమీపంలో గల శారదా బేకరీలో ఉదయం 5 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. బెకరీ వస్తువులు కిరాణా సామగ్రితో పాటు ఫ్రిజ్‌లు వంటి విలువైన వస్తువులు కాలి బూడదయ్యాయి. రూ.6 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లింది. బాసర మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అభిమన్యు, ఎస్ఐ గణేష్, విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో మరో చిరువ్యాపారికి చెందిన కిరాణా షాపు షార్ట్‌సర్క్యూట్‌తోనే ప్రమాదం చోటుచేసుకుంది. ఈ షాపులో కూడా కిరాణా సామాగ్రి అంతా అగ్నికి ఆహుతి అయింది. చేతికి ఒక వస్తువు అందలేదు. ప్రమాదంలో నష్టపోయిన ఈ రెండు కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భైంసా వీర హనుమాన్ ఆలయంలో చోరీ

భైంసా,జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని పులేనగర్ కాలనీ పరిధిలో గల వీర హనుమాన్ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం వేళలో భక్తులు పూజలు నిర్వహించేందుకు గాను ఆలయానికి వెళ్లగా చోరీ ఘటన వెలుగు చూసింది. ప్రధాన గేట్ ద్వారా ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించిన దొంగలు అక్కడి ముందరి భాగంలోనున్న హుండీ తాళాన్ని పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆలయం పక్కనే ఉన్న వాచ్‌మెన్ లక్ష్మణ్ గదికి వేసిన తాళం పగులకొట్టి లోనికి వెళ్లారు. డబ్బుల కోసం వెతికి గదిలోని వస్తువులను చిందరవందరగా చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పార్క్‌చేసిన వాచ్‌మెన్ ద్విచక్ర వాహనాన్ని దొంగలు కొద్ది దూరం మేరకు తీసుకవెళ్లి అక్కడ వదిలి పెట్టి వెళ్లిపోయారు. తాను దాచిపెట్టి ఉంచుకున్న నగదును దొంగలు అపహరించుకపోయినట్లుగా వాచ్‌మెన్ తెలిపారు. చోరీ జరిగిన సమయంలో వాచ్‌మెన్ లక్ష్మణ్ సొంత పనుల నిమిత్తం స్వగ్రామానికి వెళ్లినట్లుగా తెలిసింది. చోరీ ఘటనపై ఆలయ కమిటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లుగా టౌన్‌సీఐ గోపినాథ్ వెల్లడించారు. ఆలయ సీసీ కెమెరా పుటేజీతో పాటు ప్రధాన రోడ్డు మార్గాల్లోని సీసీ పుటేజీ ద్వారా చోరీకి పాల్పడ్డ దొంగలను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లుగా సీఐ గోపినాథ్ వివరించారు.